# మనసు ఉన్న ఆడది



విజయ మళ్ళీ నన్ను పలుకరిస్తుందనీ, ఆ విషయమే ప్రస్తావిస్తుందని నేను అనుకోలేదు.

నిన్న సాయంత్రంనుండి నేను ఏమిటో నాకు తెలియదు. ఆ విషయం వారికికూడ చెప్పలేదు. చెప్పాలనే ఉందిగానీ, నాకే అర్థం గావటంలేదు ఎందుకు చెప్పలేక పోయానో.

ఇది నా బలహీనత అని నేననుకోలేను. కానీ, నిన్నరాత్రి ఆ విషయం వారితో చెప్పాలనుకోవడం, నా నోటిలో తడి ఆరి పోవడం రెండూ ఒకటేసారి జరిగాయి.

* * *

ఆరోజు సాయంత్రం ఆరింటికే ఇంటికి వస్తానన్న ఆయన ఎనిమిదికిక్కూడ రాలేదు. సినిమాకు వెడదామని ఆయనే అన్నారు— చూసి చూసి ఏడింటికి బట్టలు మార్చాను.

ఎనిమిదింబావుకు వారు వచ్చారు.

అసలు అలాటి సమయంలో— అంటే, వారు ప్రపోజ్ చేసింది వారివల్లే డ్రాప్ అవడంలాంటి సమయాలలో, వారేవచ్చి ఎందుకలా జరిగిందో విశదంగ చెప్పేవారు నేనేం సీరియస్‌గ తీసుకోకపోయినా. ఆనాడు అదేం చిత్రమోగానీ, వచ్చిన పావుగంట వరకు నేను అనే మనిషిని ఉన్నాననే పట్టించుకోలేదు. వచ్చి బూట్లు విప్పి, కుర్చీలో కూర్చొని, డైలీ చదువుకోవడం ప్రారంభించారు. ఆనాటి వారి ప్రవర్తన కొద్దిగ విచిత్రం అనిపించినా, ఆఫీసులో గొడవ పడ్డారేమో అని అనిపించిందినాకు.

నే నిచ్చిన టీ తాగారు.

'అన్నపూర్ణా!' ఖాళీగ్లాసు తీసుకొని నిష్క్రమిస్తున్న సమయంలో వారన్న మాటలు సరిగ వినిపించుకోలేదు నేను. మళ్ళీ చూశాను వారికేసి.

'నిజం అన్నపూర్ణా! నన్ను సస్పెండ్ చేశారు.' మాన్పడిపోవడం అనే పదానికి ఆనాడర్థం తెలిసింది నాకు.

ఎందుకు? ఎలా? అనేదడగాలనే ఊహే నాకు తట్టలేదు.

'లంచం తీసుకొన్నాననే ఆరోపణతో నన్ను సస్పెండ్ చేశారు.'

సానుభూతి తెలియజేయాల్సిన సమయమది. కానీ వారిని ఓదార్చటంకన్న నన్ను నేను ఓదార్చుకోవటం ముఖ్యం, ఏమనాలో, ఏంచేయాలో తెలీలేదు నాకు.

'బ్యాంకులో డబ్బెంత ఉంది?'

'దాదాపు అయిదువందలేమో' అన్నాను నేను.

'ఉహూ!'— క్షణకాలం నిశ్శబ్దమే, కానీ ఎంత భయంకరం!

'రేపటినుండే...'

వారు తలవంచుకు మాట్లాడుతున్నారు. నాకు చాల బాధనిపించింది. కట్టుకొన్న భార్యదగ్గర తలవంచుకొని మాట్లాడవలసిన ఖర్మ ఏమిటో నా కర్థంకాలేదు.

'ఖర్చు తగ్గించు అన్నపూర్ణా! మళ్ళీ...' వా రెంతగ బాధపడుతూ

అన్నారో నాకు తెలుసు! బాధను పంచుకోవాల్సిన అగత్యం నాకు ఉన్నా ఎలా పంచుకోవాలో అర్థంకాక, పంచాల్సిన బాధ్యత వారిపైనే ఉందని సంతృప్తి పడ్డాను.

తర్వాత మెల్లిగ వారే, కారణాలు అన్నీ చెప్పారు.

రెండునెలల తర్వాత ఇంట్లో డబ్బయిపోయింది. మా ఇంటికిరాసి తెప్పిస్తా నన్నాను.

'ఏమని రాస్తావ్?' అని అడిగారు.

'ఇదీ పరిస్థితి అని రాస్తాను' అన్నాను నేను.

'వద్దు అన్నపూర్ణా! ఆ పని మాత్రం చేయకు ప్లీజ్' అన్నారు వారు. సస్పెండ్ అయిన తర్వాత ఆయన నావద్దకూడ ఏదో ఫీలవుతునే ఉన్నారు.

తర్వాత అనిపించింది—అత్తవారింటివద్ద చులకన అవటం ఎవరికిష్టం ఉంటుంది? ఆరోజే ఎక్కడినుంచో డబ్బు తెచ్చి ఇమ్మా 'ఇది లంచంకాదు అన్నపూర్ణా!' అన్నారు.

నాముఖం పాలిపోయింది. ఏమీ అనలేకపోయాను.

మనిషిని పరిస్థితులెంతగ లొంగదీసుకుంటాయో తెలిసివచ్చింది నాకు.

*           *           *

కొన్నాళ్ళ తర్వాత, రిపోర్టు వచ్చింది. ఆరోపణ నిజంగ బుజువు చేయబడలేదు గనుక, సస్పెన్షన్ ఉత్తర్వును ఉపసంహరించుకోవాలని నిర్ణయం చేయబడింది.

మర్నాడు ఆఫీసుకువెళ్ళారు. ఒక మోస్తరుగ ఆ ఒక్కరోజులోనే కోలుకోగలిగారు. అయినా ఇంకా ఆ ఛాయలు పూర్తిగ సమసిపోలేదు.

నెలరోజులు గడిచిపోయాయి. ఈనెల దినాలలో వారు పేపర్లో కనిపించిన ప్రతి పోస్టుకు అప్లయి చేశారు. ఎందుకో అడగాలనే ఉత్కంఠను చంపుకున్నాను నేనే.

*           *           *

ఈ రోజులలో పరిచయమయింది విజయ నాకు.

షాపింగ్ సెంటర్‌లో జరిగిన పరిచయం విజయ మా ఇంటికి రావటంతో దృఢతరం అయింది. ఇంటి విషయాలు కష్టసుఖాలు చెప్పుకొనే పరిస్థితి కూడ వచ్చింది.

తర్వాత ఒక రోజున ... వారికి ఏదో కంపెనీలో ఇంటర్వ్యూకు కాల్ వచ్చింది. నాతో చెప్పారు, మంచి ఉద్యోగమని.

ఆ విషయం, ఈ విషయం చెబుతూ విజయతో ఈ విషయం చెప్పాను. కంపెనీ పేరు తెలుసుకొని చాల సంతోష పడింది.

'ఆత్మీయులకు సాయంచేసే అవకాశం రావటం అదృష్టంకదూ అన్నపూర్ణా! మావారు ఇంటర్వ్యూ బోర్డులో మెంబరు. ఈపోస్టు ఖచ్చితంగ మీవారిదే' అంది విజయ.

విజయ స్నేహాన్ని ఈవిధంగా ఉపయోగించుకోవడం ఇష్టంలేకపోయినా, కాదనలేకపోయాను..వారితో ఆవిషయం చెప్పాను. చాల ఇబ్బందిగ అన్నారు— 'చూడు అన్నపూర్ణా! నా కన్న అధికులైనవారు వస్తే, వారేంకావాలి చెప్పు అన్నపూర్ణా! అందరికీ విజయవంటివారే స్నేహితులవుతారా? అయినా ఈ స్నేహాన్నిలా కలుషితం చేసుకోకు' అన్నారు. 'మనిషి స్వశక్తిమీద ఆధారపడటం అభిలషణీయం, నాకది ఇష్టంకూడా, వెళ్ళి మీ విజయతో చెప్పిరా ఇలా రికమండేషన్ వద్దని. మర్చిపోకు' అన్నారు.

విజయతోడి ఈవిషయం చెప్పేసరికి కృంగిపోయింది. నాకే నచ్చచెప్ప యత్నించింది.

నాకు ఒళ్ళుమండింది, నాభర్త విషయంలో నీకింత బాధేం అన్నాను. తెల్లబోయింది విజయ.

వారితో ఈ విషయం చెప్పాను నేను—తృప్తిగ నిట్టూర్చినా, 'స్నేహానికి నీళ్ళొదులుకోవటం మంచిది కాదు' అన్నారు. నిజమే ననిపించింది నాకు 'అంత మంచి స్నేహితురాలు, ఆత్మీయత పంచుకొనే వ్యక్తి దొరకడం అదృష్టం అన్నపూర్ణా! ఇలాటి సాయం చేయగలము, చేద్దాము అనే ఊహ రావడమే అపూర్వం' అన్నారువారు.

నాకు నిజమే ననిపించింది.

*           *           *

నాలుగు రోజుల తర్వాత, విజయ మళ్ళీ నన్ను పలకరించినా, ఈ విషయం ప్రస్తావిస్తుందనుకోలేదు నేను.

మావారు ఉద్యోగానికి సెలక్టయ్యారట.

నాకు ఈ వార్త నిశ్చయంగ సంతసం కలిగించిన మాట నిజమే గానీ, విజయకీ విషయం ఎలా తెలిసిందో, భర్త తనంత తనే ఫలానా ఆయన ఈ పోస్టుకు సెలెక్టయ్యారని భార్యకి చెప్పరనే గ్యారంటీ ఊహతో ఉన్న నాకు పెద్ద సమస్య అయింది.

తర్వాత మావారు ఆ ఉద్యోగంలో చేరిపోయారు.

*           *           *

నేను, విజయ కూర్చొని ఆ గదిలో మాట్లాడుకొంటున్నాము ఆ రోజు. ఆ గదిలోకి చరచరా వచ్చేశారు వారు ఆ సమయంలో. గబుక్కున విజయ లేచి, చరచరా వెళ్ళిపోయింది—నేను పిలుస్తున్నా వినిపించుకోక. విజయ ప్రవర్తన అర్థంకాక ఆలోచిస్తున్న నన్ను వారే ఈలోకంలోకి తెచ్చారు.

'విజయ అంటే ఈవిడేనా?'

'ఔను గానీ, అప్పుడే వచ్చేశారేంటి?' అన్నాను నేను.

'ట్రైన్‌లో ఏలూరుకు వెళ్ళాలి—రాత్రికి. బట్టలు సగయిరా సర్దమని చెప్పడానికి వచ్చా! వారం దాటుతుంది తిరిగి రావటానికి' అన్నారు.

వారం రోజులు! గుండెల్లో రాయి పడింది.

వారంరోజులు ఒంటరిగ ఈ ఇంట్లో... నాకు సమస్య అన్నది చెప్పాను వారితో.

'విజయ ఉంటుందిగా!' అన్నారు.

ఎందుకో ఎబ్బెట్టుగ అనిపించింది నాకు.

*           *           *

వారం తర్వాత తిరిగి వచ్చారు వారు. ఆ రోజుకు విశ్రాంతి తీసుకొని మర్నాడు ఆఫీసుకు వెళ్ళిపోయారాయన. ఏమీ తోచక తిరుగుతోంటే వారి డైరీ కనిపించింది. ఎందుకో చదవాలనిపించింది. కానీ అది తప్పు.

ఇతరుల డైరీ చదవడం తప్పు.

కానీ వారు నాకు 'ఇతరులు' కారు.

పేజీలు తిప్పాను. ఆఫీసు విషయాలు, రంగురంగుల ఆలోచనలు. ఒకచోట విజయ పేరు కనిపించింది. ఆత్రంగ చదివాను.

'విజయ మళ్ళీ కనిపించింది' అంతే.

నా మనస్సు నరికట్టుకోలేకపోయాను. డైరీ చదవకపోయినా బాగుండేది!

తెరిచి ఉంచిన డైరీని మూయాలనే ఊహే తట్టలేదు నాకు—'అన్నపూర్ణా! డైరీ చదివావా?' అని అడిగేవరకు.

నా బదులు తెరిచి వుంచిన డైరీయే జవాబిచ్చింది.

'చాల చెడ్డపని చేశావ్ అన్నపూర్ణా! అనవసరంగ హైరాన పడకు.' అని నారన్నా కానీ నేను హైరానపడుతునే ఉన్నాను.

అన్నాడు రాత్రి భోజనాలదగ్గర ఆ ప్రసక్తి తేవడానికి ప్రయత్నించాను.

'విజయ మీ కింతకుముందే తెలుసా?'

ప్రశ్న ఇంతసూటిగ వస్తుందని అనుకో లేదు గాబోలు, ఆశ్చర్యపోయారు.

నవ్వుతూ, క్షణం తర్వాత అన్నారు—'అవునుగానీ, దీన్ని దేనికి ఉపోద్ఘాతం చేయకు.'

*　　*　　*

రెండు రోజుల క్రితం తీసుకొన్న నిర్ణయాన్ని ఈవేళ అమలుచేయాలి. ఫలిత మెలా ఉన్నాసరే!

వారు ఆఫీసుకు వెళ్లిపోయాక, వారి పెట్టె తీశాను. డైరీలలో 52 డైరీ మాత్రం లేదు. 53 ది తీశాను. పేజీలు తిప్పాను.

జనవరి! జరగకూడనవన్నీ జరిగాయి క్రితం సంవత్సరం. అందుకే డైరీని కాల్చి వేశాను. చాలహాయిగ ఉంది...

ఎవరో తలుపుతట్టారు. విజయనుకుని వెళ్లి తలుపు తీశాను. వారు!

లోపలికిరాగానే అంతా అర్థమయింది వారికి—'అయితే, డైరీలన్నీ చదివావన్న మాట.'

వారెంత నిగ్రహం చూపుతున్నారో అర్థమయింది నాకు.

'లేదండీ!'

'నోర్ముయ్.' నాచెంప పేలిపోయింది.

# మనసు ఉన్న ఆడది

'చేసే వెధవ పనికి తోడు లబద్ధం కూడా.' అంటూ వెళ్లిపోయారు.

'ప్రక్కమీద వాలిపోయి ఎంతసేపు ఏడ్చానో నాకు తెలియదు. సాయంత్రం తలుపుతట్టిన చప్పుడుకు తలుపు తీశాను. వారే!

'ఏడ్చావా? మొద్దూ—తప్పుకదూ!' కంఠంలో బాధ కనిపిస్తోంది.

హఠాత్తుగా వారి వక్షానికిచేరి వెక్కి వెక్కి ఏడ్వసాగాను నేను. వారు నన్నలా వక్షానికి చేర్చుకునే అన్నారు—'ఏడువకు అన్నపూర్ణా! చెయ్యొద్దన్నది ఎప్పుడూ చెయ్యకుమరి' అన్నారు.

'నిన్ను కొట్టినందుకు నేనెంతగ బాధ పడుతున్నానో తెలుసా? పశువులాగ ప్రవర్తించానుగదూ!'

నా తలమీద టప్మని నీటిచుక్క పడింది. తలెత్తి చూశాను.

వారికంట్లో కన్నీరు.

భర్త కంట్లో నీరు చిలికించ గలిగిన స్త్రీకి విష్కృతి లేదు.

*　　*　　*

రాత్రి భోజనాలదగ్గర అన్నారు మళ్లీ—'నేను వద్దన్నది మానెయ్ అన్నపూర్ణా! అనవసరంగ మనసుల్ని పాడుచెయ్యకు. ఇన్నాళ్లకు చేయిచేసుకున్నాను.'

'నన్నడిగితే నేచెప్పేవాడినేగా నీకు విజయ ఎవరో!' అన్నారు.

అడగాలనిపించినా అడగలేకపోయాను నేను.

*　　*　　*

తెల్లగ తెల్లవారింది.

వారు ఎందుకో ఆఫీసుకు సెలవు పెట్టారు. మధ్యాహ్నంపూట విజయ రావడం అలవాటు.

వీధిగదిలోనే వారు కూర్చుని పేపరు చదువుకుంటున్నారు. ఎవరో వస్తున్నసడి వినిపించింది నాకు.

ఓరవాకిలిని తోసి లోనికివస్తున్న విజయ, మావారినిచూసి తత్తరపడింది.

మావారుకూడ లేచారు. ఒక చేతో పేపరును పట్టుకొని నిలబడ్డారు.

వారిని చూడగనే వెనక్కి వెళ్లిపోబోయింది విజయ.

'విజయ లక్ష్మిగారూ !'

చటుక్కున వెనక్కి తిరిగింది విజయ లక్ష్మి—

'రండి, వెళ్లిపోతున్నారేం ?'

మావారి ఈ ఆహ్వానికి ఆశ్చర్యపోయింది విజయ.

మౌనంగ లోనికి వచ్చింది విజయలక్ష్మి.

లోనికి రాగానే మావారు అడిగారు విజయను—'జ్ఞాపక మున్నానా ?'

తల ఊపింది, జ్ఞాపకం ఉన్నారన్నట్టు.

'చూడండి, అన్నపూర్ణకు మీరు కొంచెం చెప్పాలి—మీరు నాకేమవుతారు ?'

తెల్లపోయింది విజయ.

నా మనసులోని ప్రశ్న అంత ఖచ్చితంగ మాటలలోకి అనువదించ గలిగినందుకు మావారికి నే నెంతో ఋణపడ్డాననిపించింది.

'అన్నపూర్ణకు ఏదో...పోనీలెండి, మీరు చెప్పండి, మీరు నాకేం అవుతారో ?'


సూటిగ అడిగిన ప్రశ్నకు జవాబివ్వ లేక పోయింది విజయ.

నాకు తల తీసేసినట్లున్నా, ఓర్చుకో గలిగాను—నిజం తెలుస్తోంది.

'మీరు నాకేం అవుతారు ?'

మళ్లీ అడిగారు.

'చెప్పండి — మరేమీ అనుకోకండి ఇలా అడుగుతున్నానని, కారణం నాకన్నా బాగా



అన్నపూర్ణ చెప్పగలదు మీకు...పోనీలెండి నాకు చెప్పకపోయినా, అన్నపూర్ణకయినా చెప్పండి.'

మావారు వెళ్ళిపోయారు.

క్షణం తర్వాత ఆ విషయం తెలిసింది మా ఇద్దరికీ.

తేరుకుంటూ అంది విజయ — 'అన్నపూర్ణా! ఏమిటిది!'

నేనుమాత్రం ఏమని చెప్పను?

నోట మాటరాక, వెళ్ళి డైరీ తెచ్చి విజయ ముందుంచాను.

చదువుకొంది — 'విజయ మళ్ళీ కనిపించింది.'

డైరీ మూసి, తిరిగి నాకిచ్చేస్తోంటే, ఒక ఫోటో పడింది. తీసిచూశాను—అది విజయది!

తిరగేసి చూశాను — వెనక ఏమీ రాసి లేదు.

'ఊ, ఇదా సంగతి!' అంది విజయ సాలోచనగా.

అంతా అర్థమయినట్లుంది విజయకు.

మెల్లగ చెప్ప నారంభించింది—

'అన్నపూర్ణా! మీవారు నాకు దాదాపు అయిదేళ్ళ క్రితమే తెలుసు అసలు ఒక విధంగ నీకన్న ముందు నేనే ఈ ఇంటి యజమానురాలిని కావాల్సింది — అర్థమయిందిగదూ!'

నాకేమీ అర్థంగాలేదు.

నా ఇంటికి విజయ యజమానురాలెలా అవుతుంది.

విజయ కలగంటోందా?

నవ్వుతూ, తల ఊపుతూ అంది విజయ — 'లేదు—కలలుకనే వయసు ఇపుడు దాటిపోయిందనుకుంటా! కలలుగనే వయసులోనే నాకు మీవారు తెలిసారు.'


విజయలక్ష్మి వాక్యంకన్నా ముందు నా గుండె ఆగిపోయింది.

విజయను మావారు ప్రేమించారా?

ఊహే అయినా, నాకు ముచ్చెమటలు పోసాయి.

ఛీ!...

'నిజం అన్నపూర్ణా! పరిచయం కూడ సరిగ జరగకనే, నేను మీవారికి అన్యాయం తలపెట్టాను. ఏ ఆడదీ బహుశా ఏ మగవాడికీ అంత అన్యాయం తలపెట్టి ఉండదు. కానీ నాకు గత్యంతరం లేకపోయింది. ఏంచేయను చెప్పు?'



# మనసు ఉన్న ఆడది

నాకంతా తికమకగ ఉంది: 'ఏ ఆడదీ ఏ మగవాడికీ చేయనంతటి అన్యాయం ?'

ఏమయి ఉంటుంది అది?

గుండెలుతీసిన బంటు విజయలక్ష్మి.

ఉహూ, కాదు, మావారే!

అసలిన్నాళ్ళూ మావారికి — అమాయకంగా అదోలా కనబడే— ఆయనకు ఒక కథ కూడ ఉందని నాకు తెలియదు.

నేనది ఊహించలేకపోయాను.!

ఇప్పుడో—

మావారికొక కథ!

కథలో కథానాయకి కూడ ఉంది!

హృదయం అంతా ఆవేదనతో, అశాంతితో కలవరపడ నారంభించింది.

ఈ విజయలక్ష్మితో మావారికి 'సంబంధం' ఉన్నట్లు తెలిస్తే—హు! ఈవిడ గారిని తనతో మాట్లాడనిచ్చేదా ? తన గుమ్మం యెక్కనిచ్చేదా?

ఈవేళ—పైగా నా యింటికి వచ్చి—ఈ యిల్లు నీ కన్న ముందు నాది కావాల్సింది అనగలిగిందంటే...

మొత్తానికి ఈ తప్పిదం అంతా నాదే!

ఎవరూ ఎదురు చెప్పలేని నిజం ఇది!!

ఉన్నట్లుండి విజయ భుజంమీద తట్టడంతో ఆలోచనలన్నీ ఆగిపోయాయి. అసహ్యం వేసింది— ఆప్యాయంగ భుజం మీద చేయివేసి, అదాటున గోతిలోకి తోసే నారంటే నాకసహ్యం.

భయం కూడా!

'వింటున్నావా అన్నపూర్ణా! నిజమే! మీవారు ముందుగ నావారు కావాల్సినవారు.'

ఛీ! ఎలా అంటోంది—పరాయి స్త్రీ మొగుణ్ణి తన మొగుడుగ ఎలా తలుచుకోగలుగుతోంది?

ఒళ్ళు జలదరించింది నాకు.

'ఈనాడు తలచుకుంటుంటే నాకూ ఆశ్చర్యం వేస్తోంది — ఆనాడు నాకంతటి ధైర్యం, అంతటి తెగువ ఎలా వచ్చాయో? కాని అంతటి తెగువ వెనుక ఉన్న ఒక చిన్న మచ్చ నన్ను ఇంకా కలవరపరుస్తూనే ఉంది. మీవారికి నేను చేసిన అన్యాయం క్షంతవ్యం కాకపోయినా, ఒక విధంగా నేనలాగే ప్రవర్తించాల్సి వచ్చింది. ఏం చేయను! అన్నపూర్ణా!' అంది విజయ.

నాకు అసలు మాట్లాడ బుద్ధికాలేదు.

నవ్వుతూ అంది విజయలక్ష్మి —

'నీకు యిలాగ చెపితే బహుశా అర్థం కాకపోవచ్చు: విశదంగ చెబుతాను విను.'

క్షణం ఆలోచించి, గతం అంతా గుర్తుకు తెచ్చుకుంది కాబోలు, దానికి గుర్తుగ దీర్ఘంగ నిశ్వసించింది విజయలక్ష్మి.

'ఎక్కడ మొదలుపెట్టాలో తెలియడం లేదు గానీ, ఖచ్చితంగ ఇది నాపెళ్ళిరోజున బయటపడింది—నాకు ప్రసాదరావంటే చాల యిష్టం.' అంది విజయలక్ష్మి.

తటాలున అడిగాను — 'ప్రసాదరావెవరు ?'

నవ్వుతూ జవాబిచ్చింది — 'నా భర్త పేరు ప్రసాదరావు. ప్రసాదరావంటే నాకు చాల యిష్టం. ఈ ఇష్టాన్ని ప్రేమ అని నువ్వంటే నా కభ్యంతరం లేదు. కానీ ఈ యిష్టాన్ని యింట్లోవాళ్ళకు యెలా తెలియజెప్పాలో అర్థం కాలేదు నాకు. అతడు మాకన్న తక్కువ కులస్థుడని మా యింట్లోవాళ్ళు నిరాక్షేపణీయంగ ఆక్షేపించేవారు. అందుకే భయపడ్డాను నేను. మా యింట్లోవాళ్ళకు నేను తెలియపర్చలేదు.

'అపుడు పరిచయం అయింది — పరిచయం అని అనకూడదేమో కానీ, ఇంకేమనాలో నాకు తెలియడం లేదు — వయసు దాటిపోతోందంటూ—శుద్ధ అబద్ధం అది, నా వయసు అప్పటికి పద్దెనిమిదేళ్ళు అంతే! ఊ, తొందరచేసి. పెళ్ళి చేయాలనుకున్నారు. అనుకోవడం తడవుగ దొరికిన మీవారికి నన్ను చూపించారు, పెళ్ళి తతంగంతో. పెళ్ళిచూపుల తర్వాతేగా అంతా




ఉన్నది అనే భావంతో పెళ్ళి చూపులకు అంగీకారం వ్యక్తపరిచి, మౌనంగా దాన్ని కానిచ్చాను.

'నా ఊహ ప్రకారం మీవారికి నేను నచ్చనంత మాత్రంలో పెళ్ళి జరిగిపోతుందా అనే అనుకున్నాను నేను. పైపెచ్చు పీటలమీది పెళ్ళికూడ ఆగిపోవడం మనకు తెలియని విషయమూ కాదు, అందుకే ఎక్కడో ఓ చోట గొడవజరిగి, పెళ్ళి ఆగుతుందని ఆశించిన నేను చివరిదాకా ఆశాభంగం పొందుతూనే వచ్చాను.

'రేపు పెళ్ళనగా ప్రసాదరావు అన్నాడు వెళ్ళిపోదాం అని. ఆర్యాతి ఆలోచనలతో సతమతమయి చివరకు మీవారు వారితరపు చుట్టాలూదిగిన విడిదిమీదుగనే వచ్చేశాను నేను. అంతే— ఆ తర్వాత ఏం జరిగిందో నాకు తెలియదు—బహుశా మర్నాడు పొద్దున్నే నాపోకడ తెలిసి ఉంటుంది అందరికీ — గుండెలు బాదుకుంటూ అమ్మానాన్న ఏడ్చి ఉంటారు— అంతే!'

విజయలక్ష్మి ఆడదికాదేమో ననిపించింది నాకు ఆ క్షణంలో. మనసు మమత అంటూ ఏదైనా ఉండిఉంటే—'గుండెలు బాదుకుంటూ మా అమ్మానాన్నా ఏడ్చి ఉంటారు'—అని అనగలిగేది కాదు!

'కానీ, అన్నపూర్ణా! ఆనాడలా చేశానె కానీ, మీవారిని అనవసరంగ బాధపెట్టానని బాధపడ్డ క్షణాలు ఎన్నో ఉన్నాయి. కానీ ఏంచేయను? ఆ అన్యాయాన్ని ప్రతిఘటించ గలగడానికే ఏదో ఉపకారం చేయాలనిపించేది నాకు—యధాలాపంగ పరిచయం అయిన నీవు, వారి ఇల్లాలివే అని తెలిసిన తర్వాతనే నీతో మరికొంచెం స్నేహంగ ఉండటం—మొన్న అనుకోకుండా లభించిన ఆ అవకాశాన్ని మావారికి విడమర్చిచెప్పి, వినియోగించుకోగలగటం జరిగింది—నాకు చాల తృప్తిగ ఉంది అన్నపూర్ణా!— మీవారికి నేను చేసినది అన్యాయమే కానీ, నేను మీకు మీవారికి మనస్తాప నివారణకోసం కొంత ఉపకారం కూడ చేయగలిగాననే తృప్తి నాకీనాడెంతగనో ఉంది—నన్నర్థం చేసుకోగలవుగదూ అన్నపూర్ణా!' అంది విజయలక్ష్మి.

నేనేకాదు, మనసుఉన్న ఆడదెవరైనా విజలక్ష్మిని అర్థం చేసుకోగలరనిపించింది ఆక్షణంలో నాకు. ●